TGTEL/26/A6780

# స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :05 | సంచిక :05 | పేజీలు 8 వెల : 5 | బుధవారం 16 సెప్టెంబర్ 2026



## యువతకు గుడ్ న్యూస్..



## ఆళ్ల నాని ఆకస్మిక మృతి

**గుండెపోటుతో మాజీ డిప్యూటీ సీఎం కన్నుమూత**

**ఏలూరు రాజకీయాల్లో విషాదం**

**నేతలు, కార్యకర్తల సంతాపం**

ఏలూరు, సెప్టెంబర్ 15: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త వెలుగులోకి తరువాయి 2 వ పేజీలో..

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

**ఆగా ఖాన్ ఫౌండేషన్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి**

**విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ**

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వివరించిన ముఖ్యమంత్రి**



తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ మరింత భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్య, వైద్యం, పర్యాటక రంగాల అభివృద్ధిలో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 15: ఈ సందర్భంగా తెలంగాణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్య మంత్రి గుర్తు చేశారు. హైదరాబాద్ నగరం తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావిస్తూ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. తెలంగాణ వార సత్వ సంపద పరిరక్షణలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. శాసన మండలి భవనం, కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణలో ఫౌండేషన్ అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ తరువాయి 2 వ పేజీలో..

## గురుకులాల పనివేళలపై వివరణివ్వండి: హైకోర్టు



హైదరాబాద్: తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనివేళల మార్పుతోపాటు ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించడంపై వివరణివ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2024లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 16, అదేవిధంగా పనివేళలు మారుస్తూ ఈ ఏడాది జూన్‌లో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో గురుకులాలను చేర్చాలని కోరుతూ ఎం.సిప్లీ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గురుకులాల పాఠశాలల పనివేళలు ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉన్నాయని, దీన్ని ఉదయం 9 నుంచి 4.30 వరకు ఉండేలా సవరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఉపాధ్యాయులకు స్టడీ అవర్, వార్డెన్, హాస్టల్ ఇన్‌ఛార్జి వంటి అదనపు విధులు అప్పగించరాదని ఆదేశించాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు

- రూ.2,000 మించితే ఎండీఆర్ 0.40%
- రూ.75,000 దాటితే గరిష్ఠంగా రూ.300
- అక్టోబరు 15 నుంచి అమలు
- వ్యక్తిగత లావాదేవీలు ఉచితమే





2లో..



## తెలంగాణతో అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలి

ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్‌తో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్‌తో కరచాలనం చేస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్: రాష్ట్రంతో ఆగాఖాన్ ఫౌండేషన్ కొనసాగిస్తున్న అనుబంధాన్ని భవిష్యత్‌లో మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా.. ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్‌ను కోరారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌తో మంగళవారం ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఛైర్మన్ రహీమ్ ఆగాఖాన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ.. 'భారతదేశ అభివృద్ధికి ఆగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశేషంగా కృషి చేస్తున్నారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ, పరిసరాల అభివృద్ధిలో ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ చేపట్టిన కార్యక్రమాలు.. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. విద్య, పట్టణ పునరుద్ధరణ, సామాజిక ఆరోగ్య సేవలు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సంస్థ చేస్తున్న కృషి.. స్థానిక సమాజాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తోంది. హైదరాబాద్ సమీపంలోని

ఆగాఖాన్ అకాడమీ.. ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలతో భవిష్యత్ తరాల నాయకులను తీర్చిదిద్దుతున్న సంస్థగా నిలుస్తోంది. ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ సమాజానికి మేలు చేసే శక్తిగా ఉంది. తెలంగాణ-ఏకేడీఎన్ మధ్య సహకారాన్ని మరింత విస్తరించాలి' అని గవర్నర్ కోరారు.

## లోతుకుంట భూముల కేసులో సుప్రీం ట్విస్ట్.. 219 రోజులు లేటైతే పిటిషన్ ఔట్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**



నగరంలో సంచలనం రేపిన లోతుకుంట భూవివాదంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కోర్టు తీర్పుపై అప్పీల్‌కు సాధారణంగా 90 రోజుల గడువు ఉంటే.. ఈ కేసులో ఏకంగా 219 రోజులకు అప్పీల్ దాఖలైందన్నారు. గడువు ముగిసినందునే సుప్రీంకోర్టు పిటిషన్‌ను కొట్టివేసిందని స్పష్టం చేశారు. లోతుకుంట భూములపై త్వరలోనే సమగ్ర సర్వే చేపడతామని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాతే భూముల అసలు లెక్క.. పూర్తి నిజం బయటపడుతుందని రంగనాథ్ వెల్లడించారు.

## కొండా సురేఖ చాంబర్లకు తాళం.. సెక్రటేరియట్‌లో సీల్ పంచ్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

తెలంగాణ సచివాలయంలో మాజీ మంత్రి కొండా సురేఖకు కేటాయించిన కార్యాలయ గదులకు అధికారులు సీల్ వేశారు. సెక్రటేరియట్ 4వ అంతస్తులోని 4ఎఫ్ విభాగంలో 10, 11, 12 నంబర్ గదులకు తాళాలు వేసి, సీల్ చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మంత్రిగా కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వం ఈ చాంబర్లను కొండా సురేఖకు కేటాయించింది. అయితే ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో.. అధికారులు ఆమెకు కేటాయించిన కార్యాలయాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో సెక్రటేరియట్‌లో కొండా సురేఖ చాంబర్లకు తాళం పడటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## ఉద్యోగులతో పెట్టుకుంటే.. అధికారం గల్లంతే! కవిత కిర్రాక్ కామెంట్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

ఉద్యోగులు, టీచర్లతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ పవర్‌లోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సదస్సులో కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా గుర్తించి గౌరవంగా పనిచేసే వాతావరణం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 630

మండలాలకు కేవలం 8 మంది పర్మినెంట్ ఎంఈవోలు ఉండటం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. టీచర్లను రిపోర్టులు, డేటా పనుల్లో ముంచేస్తున్నారని విమర్శించారు. పీఆర్సీ, డీఏల హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు.



## 22ఏలో 'గోల్‌మాల్'.. జ్యుడీషియల్ జడ్జిమెంట్ కావాలంటున్న కేటీఆర్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**



22ఏ అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరపాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు మూడేళ్లు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. మూడేళ్లుగా సెటిల్‌మెంట్లు చేసుకుని ఇప్పుడు రెగ్యులరైజేషన్ పేరుతో హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చే ప్రతి స్కీమ్ వెనుక ఓ పెద్ద స్కామ్ ఉంటోందని కేటీఆర్ విమర్శించారు. 'భూభారతి' పేరుతో భూహారతి చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 22ఏ వ్యవహారంలో నిజానిజాలు బయటకు రావాలంటే న్యాయ విచారణ ఒక్కటే మార్గమని డిమాండ్ చేశారు.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు




నగదు రహిత చెల్లింపుల్లో ఎంతో కీలకంగా మారిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలన్నీ ఇక పూర్తిగా ఉచితం కాదు. ఎంత మొత్తమైనా వ్యక్తిగత బదిలీలపై (ఒక వ్యక్తి నుంచి మరొకరికి- పీ2పీ) ఒక్క పైసా రుసుము పడదు. అంటే స్నేహితులు, బంధువులతో ఒక నెలలో ఎన్ని లావాదేవీలైనా ఉచితంగా చేసుకోవచ్చు. ఎలాంటి పరిమితీ ఉండదు. పెద్ద వ్యాపార సంస్థలకు రూ.2,000కు మించి చెల్లింపులు జరిపితే, రుసుములు తప్పవని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. అయితే ఈ రుసుములు వ్యాపార సంస్థలకే వర్తిస్తాయి. ఈ మేరకు 'చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం-2007లోని సెక్షన్ 10ఏ' కింద కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రూపే డెబిట్ కార్డులతో పాటు, రూ.2,000 లోపు జరిపే వ్యాపార లావాదేవీలను (పీ2ఎం) ఉచిత ఎలక్ట్రానిక్ సాధనాలుగా వర్గీకరించింది. వినియోగదారులు, వ్యాపారుల నుంచి బ్యాంకులు లేదా పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకూడదని స్పష్టంగా ఆదేశించింది.

**చెల్లింపు రూ.2,000 మించితే**

పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే లావాదేవీల విలువ రూ.2,000 కంటే ఎక్కువుంటే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తిస్తుంది. సాధారణ ఖాతాదారుల ఖాతాల నుంచి ఈ రుసుములు నేరుగా డెబిట్ కావు. అక్టోబరు 15 నుంచి అమల్లోకి రానున్న మార్గదర్శకాల ప్రకారం.. రుసుములు ఉండనున్నాయి.

**చిరు వ్యాపారులకు భరోసా**

నెలకు రూ.1 లక్ష వరకు: యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు రూ.1 లక్ష లోపు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (పర్సన్ టు పర్సన్ మర్చంట్- పీ2పీఎం) ఎలాంటి ఎండీఆర్ వర్తించదు. పూర్తి ఉచితంగానే ఈ లావాదేవీలు ఉంటాయి.

చిరు వ్యాపారులకు రూ.2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీ వచ్చినా, వర్తకుడి అకౌంట్ పీ2పీఎం పరిధిలో ఉంటే ఎలాంటి రుసుములు ఉండవు.

ఎండీఆర్ మినహాయింపు పొందేందుకు చిన్న వర్తకులకు ఎలాంటి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ నిబంధన లేదు. చిరు వ్యాపారులు తమ క్యూఆర్ కోడ్‌లను లేదా సౌండ్‌బాక్స్‌లను మార్చాల్సిన అవసరం లేదు.

వరుసగా 3 నెలలపాటు నెలకు రూ.1లక్ష కంటే ఎక్కువ జమైతేనే... ఆ ఖాతాను పీ2ఎం (పర్సన్ టు మర్చంట్)గా మారుస్తారు.

**రూ.5 మాత్రమే...**

కొన్ని నిర్దిష్ట రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలపై శాతంతో సంబంధం లేకుండా కేవలం రూ.5 స్థిర ఎండీఆర్ మాత్రమే వర్తిస్తుంది.

బీమా ప్రీమియం చెల్లింపులు

**పెట్రోలు, డీజిల్ కొనుగోలు**

**ప్రభుత్వ విద్యుత్, నీరు, పైప్‌డ్ గ్యాస్ బిల్లులు**

**స్కూల్, కాలేజీ ట్యూషన్ ఫీజు, ప్రవేశ పరీక్షల ఫీజు**

**టెలికాం బిల్లులు చెల్లింపులు. రైలు టిక్కెట్లు.**

వినియోగ బిల్లులకు 'ఆటోపే' సదుపాయాన్ని వినియోగించుకుంటుంటే, ప్రత్యేక ఎండీఆర్ లావాదేవీ ఛార్జీ ఏమీ పడదు. రికరింగ్ డిపాజిట్లు, ఓటీటీ చెల్లింపుల వంటి వాటికి ఇదే వర్తిస్తుంది.

క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02%

క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు (మ్యూచువల్ ఫండ్లు, సెబీ నమోదిత స్టాక్ బ్రోకర్లు, షేర్ల కొనుగోళ్లు, బ్రోకర్ వాలెట్ టాప్-అప్‌లకు చేసే యూపీఐ బదిలీలపై) ఎన్‌పీసీఐ ప్రత్యేక రాయితీ రేటును నిర్ణయించింది. ఈ లావాదేవీలపై 0.02% (2 బేసిస్ పాయింట్లు) మాత్రమే రుసుము పడుతుంది. ఎంత పెద్ద లావాదేవీ అయినా, ఒక్కో చెల్లింపుపై గరిష్ఠంగా రూ.300కు ఎండీఆర్‌ను పరిమితం చేసింది.

**4% లావాదేవీలపైనే..**

రూ.2,000 మించిన చెల్లింపు లావాదేవీలపైనే రుసుము వసూలు చేయాలని నిర్ణయించడం వెనుక కారణం బలంగానే ఉంది. 2025-26లో వ్యాపారులకు యూపీఐ ద్వారా దాదాపు రూ.198 లక్షల కోట్ల విలువైన చెల్లింపులు జరిగాయి. ఇందులో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీల సంఖ్య కేవలం 4 శాతమే. అంటే, 96% లావాదేవీలు రూ.2,000 విలువ లోపే ఉంటున్నాయి. వ్యాపారులకు వెళ్లిన మొత్తం సొమ్ములో 4% లావాదేవీల వాటా మాత్రం 66% (రూ.131 లక్షల కోట్లు) కావడం గమనార్హం. యూపీఐ వ్యవస్థను సురక్షితంగా నిర్వహించేందుకు, సర్వర్ల రక్షణ, మోసాల నివారణ కోసం ఏటా రూ.20,700 కోట్లు ఖర్చవుతున్నట్లు పార్లమెంటరీ కమిటీ అంచనా వేసింది. ప్రభుత్వం ప్రోత్సాహకాల కింద 2021-22 నుంచి 2024-25 వరకు రూ.8,276 కోట్లు వెచ్చించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవస్థను నిర్వహించేందుకు పెద్ద వర్తకులపై ఈ రుసుము విధింపు అనివార్యమైంది.

**పదేళ్ల ప్రస్థానంలో...**

2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ వ్యవస్థ విజయవంతంగా పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ప్రస్తుతం 741 బ్యాంకుల అనుసంధానంతో దేశీయ డిజిటల్ చెల్లింపుల్లో 84% వాటా సాధించింది.

జులైలో రూ.29.88 లక్షల

కోట్ల విలువైన 2,366 కోట్ల లావాదేవీలు నమోదు కాగా, ఆగస్టులో లావాదేవీల సంఖ్య 2,451 కోట్ల (రూ.29.82 లక్షల కోట్ల)కు పెరిగింది. అంతర్జాతీయంగా సింగపూర్, మలేషియా, యూఏఈ తదితర 11 దేశాలకు యూపీఐ విస్తరించింది. అంతర్జాతీయంగా బ్రెజిల్ (0.33%), చైనా (0.40%) డిజిటల్ నెట్‌వర్క్‌లలోనూ ఎండీఆర్ అమల్లో ఉంది.

**40:30:30 చొప్పున**

ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంపిణీ చేసేందుకు ఎన్‌పీసీఐ పరిధిలోని 22 మంది సభ్యుల యూపీఐ అండ్ సర్వీసెస్ కమిటీ నిబంధనలు ఖరారు చేసింది. వసూలయ్యే ఎండీఆర్ మొత్తంలో ఖాతా ఉన్న బ్యాంకులకు 40%, యూపీఐ యాప్‌లు నిర్వహించే సంస్థలకు 30%, వ్యాపారులను అనుసంధానించిన బ్యాంకులకు 30% చొప్పున ఆదాయం దక్కుతుంది. ఈ ఆదాయంలో కొంత భాగాన్ని గ్రామీణ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, పీఎం స్వనిధి లబ్ధిదారుల్లో డిజిటల్ ప్రోత్సాహకాల కోసం ప్రత్యేక నిధిగా కేటాయిస్తారు.

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

మొదటి పేజీ తరువాయి

నగర పునర్నిర్మాణంలో భాగంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు గురించి ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది తీరాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తూ రాత్రి వేళ ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కళాశాల, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఫౌండేషన్ సహకారం అందించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రికి గోషామహల్‌లో కొత్త భవనం నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న భవనాన్ని వారసత్వ కట్టడంగా సంరక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ భాగస్వామ్యం రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సుకు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సదస్సుకు వందకు పైగా దేశాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ఆసక్తి వ్యక్తం చేసిన ప్రిన్స్ రహీమ్‌కు, 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో పూర్తిగా కాలుష్య రహిత నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. సింగపూర్‌కు చెందిన సంస్థ ఫ్యూచర్ సిటీ ప్రధాన ప్రణాళికను రూపొందిస్తోందని, దాదాపు 15 వేల ఎకరాల్లో హరిత ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2047 నాటికి దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆళ్ల నాని ఆకస్మిక మృతి

మొదటి పేజీ తరువాయి

రావడంతో ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ఆకస్మిక మరణం పార్టీ శ్రేణులను, అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఆళ్ల నాని 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. చిన్ననాటి నుంచే సామాజిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరిచిన ఆయన విద్యాభ్యాసాన్ని ఏలూరులోనే పూర్తి చేశారు. సి.ఆర్. రెడ్డి కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయాల వైపు అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆళ్ల నాని 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారు. 2009లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి తన రాజకీయ బలాన్ని చాటుకున్నారు. ఏలూరులో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడటానికి ఈ కాలం కీలకంగా మారింది.

రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆళ్ల నాని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ కరోనా కాలంలో కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యమయ్యారు.

గత ఎన్నికల అనంతరం వైసీపీని వీడిన ఆళ్ల నాని రాజకీయంగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 2025 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. వివిధ పార్టీల్లో పనిచేసినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ ప్రత్యర్థులతో కూడా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం ఆయన వ్యక్తిత్వంలోని విశేషంగా చెప్పబడుతోంది.

ఆళ్ల నాని మృతి పట్ల రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. ప్రజా జీవితంలో మూడు దశాబ్దాలకుపైగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రయాణం అకస్మాత్తుగా ముగియడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీరని లోటుగా భావిస్తున్నారు.

# ఆళ్ల నాని మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

## మాజీ డిప్యూటీ సీఎం మరణంపై సంతాపం

## కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

అమరావతి, సెప్టెంబర్ 15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని (కాళీ కృష్ణ శ్రీనివాస్) అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేవలం 56 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో ఆళ్ల నాని మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటని అభిప్రాయపడుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆళ్ల నాని మృతి నేపథ్యంలో చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా సంతాప సందేశాన్ని విడుదల చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన సానుభూతిని వ్యక్తం చేశారు. రాజకీయ జీవితంలో వివిధ పార్టీల్లో పనిచేసిన ఆళ్ల నాని ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఏలూరు నియోజకవర్గం నుంచి పలుమార్లు ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

# రవాణా విస్తరణకు సమగ్ర ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి

ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికలో భాగంగా గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర మధ్య ప్రాంతాల్లోకి అనుమతించకుండా ఆయా టెర్మినల్స్ వరకే పరిమితం చేసే విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల నగర రహదారులపై వాహనాల ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేస్తూ లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు మంత్రి వివరించారు. ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో పాటు వ్యక్తిగత వాహనాల వినియోగం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజా రవాణాపై మరింత విశ్వాసం పెరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నగరంలో ప్రైవేట్ బస్సుల అనియంత్రిత పార్కింగ్, రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో నగరంలోకి ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత టెర్మినల్స్ ద్వారానే నిర్వహించే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన నిబంధనల ప్రకారం యూజర్ ఛార్జీలతో టెర్మినల్స్ వినియోగించే విధానాన్ని రూపొందించనున్నట్లు వెల్లడించారు.

బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ ప్రాంతంలో సుమారు 150 ఎకరాల భూమిని టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెర్మినల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని, ప్రయాణికులకు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, మెరుగైన రవాణా అనుసంధానం వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. టెర్మినల్స్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు కొత్త రూట్లను రూపొందించి ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించనున్నట్లు చెప్పారు. టెర్మినల్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించి హైదరాబాద్‌ను సుస్థిరమైన, ఆధునిక ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై సమీక్ష

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా నవంబర్ 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' పథకం కింద తొలి విడతగా లక్ష రూపాయల వరకు స్వయం ఉపాధి ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా యువత స్వావలంబన సాధించేలా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఎస్సీ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించేందుకు కేంద్రీకృత యంత్రాల వంటశాలల ఏర్పాటును వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గురుకులాల్లో ఉత్తమ వసతి, భోజన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.గురుకులాల పూర్వ విద్యార్థుల విద్యా, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులకు సూచించారు. స్టడీ సర్కిళ్ల ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని పేర్కొన్నారు.

# కిశౌ ప్రాజెక్టు ఒప్పందానికి ఆరు రాష్ట్రాల ఆమోదం

(మొదటి పేజీ తరువాయి

మధ్య సమన్వయంతో ప్రాజెక్టు పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కిశౌ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో సుమారు 90 శాతం భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. మిగిలిన 10 శాతం వ్యయాన్ని 1994 ఒప్పందం ప్రకారం భాగస్వామ్య రాష్ట్రాలు భరించనున్నట్లు వివరించారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కిశౌ ప్రాజెక్టు కింద ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రవహించే టాన్స్ నదిపై 232.6 మీటర్ల ఎత్తుతో భారీ కాంక్రీట్ గ్రావిటీ డ్యామ్ నిర్మించనున్నారు. ఈ డ్యామ్‌లో 1,562 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉండనుంది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నీటి నిల్వ, పంపిణీ, వరద నియంత్రణ వ్యవస్థలు మరింత సమర్థవంతంగా మారనున్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 97 వేల హెక్టార్ల భూమికి సాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడం వల్ల రైతులకు గణనీయమైన ప్రయోజనం కలగనుంది.

# విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి

హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి హైదరాబాద్‌కు రానున్నారని తెలిపారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉపరాష్ట్రపతి సెప్టెంబర్ 17న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ చేరుకుని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన వేదిక, భద్రత, రవాణా, వైద్య సేవలు, పారిశుధ్యం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఆర్టీజీఎస్ సేవలపై సీఎం సమీక్ష

మొదటి పేజీ తరువాయి

పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పౌరసేవల డెలివరీలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, డేటా ఆధారిత నిర్ణయాలతో పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా ఆర్టీజీఎస్ వ్యవస్థ పనిచేయాలని సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి సకాలంలో చేరేలా శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రజల సంతృప్తే ప్రభుత్వ పనితీరుకు అసలైన కొలమానమని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం అధికారులు వివిధ రంగాల్లో అమలవుతున్న పర్యవేక్షణ వ్యవస్థలు, ప్రజా సేవల డిజిటలైజేషన్, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాకేంద్రిత పాలన, వేగవంతమైన సేవలందింపు, సాంకేతిక ఆధారిత పరిపాలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సమావేశంలో స్పష్టమైంది.

# సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**సంగారెడ్డి,సెప్టెంబర్ 15(స్పందన)**

వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వినాయక మండపాల్లో ఏర్పాటు చేసిన తొలి రోజు పూజా కార్యక్రమాల్లో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.వేడుకల్లో భాగంగా తొలుత రామ్ నగర్‌లోని రామ్ మందిర్ వద్ద కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జగ్గారెడ్డి స్వయంగా భజన చేస్తూ భక్తులతో కలిసి వీధుల గుండా ఊరేగింపుగా బ్రాహ్మణవాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి మట్టి గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చి రామ్ మందిర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రతిష్ఠించారు.అనంతరం వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయి రెడ్డి పర్యవేక్షణలో గంజి మైదాన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి తొలి పూజల్లో పాల్గొన్నారు.రామ్ మందిర్ యువసేన సభ్యుడు దత్తు ఆధ్వర్యంలో రామ్ మందిర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జరిగిన ప్రత్యేక పూజల్లోనూ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.సంగారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ అధ్యక్షతన చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కూడా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు కూన సంతోష్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద తూర్పు భరత్ సాయి రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భరత్ సాయి రెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ ఆధ్వర్యంలో తొలి రోజు పూజలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి ప్రజలకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# కుమార్తె జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ శివలీల సతీష్



**కౌడిపల్లి.. సెప్టెంబర్..15:(స్పందన)**

కౌడిపల్లి మండలంలోని వెల్మకన్న గ్రామంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామ సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్ సేవా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్ కుమార్తె హర్షిక జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వెల్మకన్న గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విద్యాభివృద్ధికి తమ వంతు ప్రోత్సాహం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు వెల్లివిరిసేలా బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరోజన, మాజీ వైస్ ఎంపీపీ బొడ్ల నవీన్ గుప్తా, ఉపసర్పంచ్ ప్రభు, రవి సాగర్, వార్డు సభ్యులు వహీదా బేగం, రజాక్, కుమ్మరి చంద్రకళ, వెంకటేశం, గణేష్, శత్రు, వడ్ల నాగభూషణం, అబ్దుల్, అశోక్, సాయి గౌడ్, నలువాల సతీష్ కుమార్, వెంకటేశం, కర్ణం కుమ్మరి శ్రీనివాస్, వెంకటయ్య రెడ్డి, వెంకటయ్య, జంగిటి వెంకటేశం, గుడ్సాబ్, నలువాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

## భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు.. యువత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**జిన్నారం, సెప్టెంబర్ 15 (స్పందన న్యూస్):**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిన్నారం మండల వ్యాప్తంగా వాడవాడలా గణనాథుల విగ్రహాలు కొలువుదీరాయి. ప్రధాన కూడళ్లు, కాలనీలు, గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో వినాయక మండపాలను ఏర్పాటు చేసి విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గణనాథుని దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో మండపాలకు తరలివస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేళ మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో మండపాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. మండపాలను విద్యుత్ దీపాలు, పుష్పాలతో అందంగా అలంకరించడంతో ఉత్సవ వాతావరణం మరింత శోభాయమానంగా మారింది.ఉత్సవాల నిర్వహణలో యువత కీలకపాత్ర పోషిస్తోంది. మండపాల అలంకరణతో పాటు భక్తులకు ప్రసాదాల పంపిణీ, పూజా కార్యక్రమాల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను యువకులు సమన్వయంతో చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**గడ్డపోతారంలో ఘనంగా పూజలు**

గడ్డపోతారం మున్సిపల్ కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యువత అంతా ఏకతాటిపైకి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించడం స్థానికులను ఆకట్టుకుంది. యువతలో ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక భావనను చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహిస్తుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో భక్తుల రాకతో సందడి నెలకొంది. నవరాత్రులు ముగిసే వరకు ఇదే ఉత్సాహంతో ఉత్సవాలను కొనసాగించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి

## జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ



**నర్సాపూర్, సెప్టెంబర్ 15(స్పందన) :**

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ నేల ఆరోగ్యంతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ జిల్లా అధికారి దేవ్ కుమార్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్ రైతువేదికలో చిన్న చింతకుంట ,జక్కపల్లి, లింగాపూర్ రైతులకు పకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ జిల్లా అధికారి దేవకుమార్ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వివిధ కిట్ల వినియోగం నేల ఆరోగ్య పరిరక్షణ ,తక్కువ పెట్టుబడి తో పంటలు సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ వి కే శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కన్‌సాన్‌పల్లిలో కొలువుదీరిన భారీ గణనాథుడు



## 15 అడుగుల వినాయకుడు ప్రత్యేక ఆకర్షణ

## నిఖిత ధీరజ్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా ఘనంగా ప్రత్యేక పూజలు

**అందోలు, సెప్టెంబర్ 15 (స్పందన)**

అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని వాడవాడలా గణనాథులు కొలువుదీరడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండపాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించడంతో గ్రామం ప్రత్యేక శోభను సంతరించుకుంది. యువజన సంఘాలు, భక్తులు, కుటుంబాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.
"వినాయకుని ఆరాధనతో గ్రామంలో భక్తిభావం, ఐక్యత మరింత పెరగాలి. విఘ్నాలను తొలగించి ప్రతి కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నాం" అని నిర్వాహకులు ఆకాంక్షించారు. గ్రామంలోని ఈశ్వరాలయం వద్ద మహాదేవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 అడుగుల ఎత్తైన భారీ వినాయక విగ్రహం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విగ్రహదాత నోమన్నగారి నిఖిత ధీరజ్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా గ్రామ పురోహితులు ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో మండపం వద్దకు చేరుకుని గణనాథుడిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహాదేవ్ యూత్ సభ్యులు విగ్రహదాత నిఖిత ధీరజ్‌రెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శేరి వెంకట్‌రెడ్డి, సిహెచ్. వెంకటేశం, మాజీ వార్డు సభ్యుడు గజేందర్‌రెడ్డి, వార్డు సభ్యుడు మాధవరెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నోమన్నగారి వెంకట్‌రాంరెడ్డి, హనుమంతురెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంగమేశ్వర్, ప్రదీప్‌రెడ్డి, దేవునూరి పోచయ్య, చాకలి ప్రభుతో పాటు మహాదేవ్ యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# రైస్ మిల్లులో విజిలెన్స్ సోదాలు.. 6,026 బస్తాల ధాన్యం మాయం

## రూ.53.91 లక్షలు చెల్లించాలని ఆదేశం

**శివ్వంపేట, సెప్టెంబర్ 15 (స్పందన)**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడురు శివారులోని ఓం సాయి వెంకటరమణ రైస్ మిల్లులో మంగళవారం హైదరాబాద్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు కలకలం రేపాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగిన ఈ తనిఖీల్లో అధికారులు మిల్లులోని ధాన్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి 6,026 బస్తాల ధాన్యం నిల్వల్లో తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు మెదక్ జిల్లా సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ తాటి నర్సింలు తెలిపారు.రికార్డుల ప్రకారం ఉండాల్సిన ధాన్యం, ప్రస్తుతం మిల్లులో ఉన్న ధాన్యం నిల్వల మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. నిబంధనల ప్రకారం తక్కువగా ఉన్న ధాన్యానికి గాను మిల్లు యజమాని ప్రభుత్వానికి రూ.53,91,606 చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.
తనిఖీల,విజిలెన్స్ అధికారులు పూర్తి వివరాలను నమోదు చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

# ఆరు నెలలుగా జీతాలు లేవు.. కార్మికుల గోడు వినేదెవరు?



**జీతాల కోసం రోడ్డెక్కిన మున్సిపల్ కార్మికులు**

**సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు.. తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్**

**జిన్నారం, సెప్టెంబర్ 15 (స్పందన న్యూస్):**

ఆరు నెలలుగా జీతాలు అందక.. కుటుంబాలను పోషించుకోలేక.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న జిన్నారం మున్సిపల్ కార్మికులు చివరకు ఆందోళన బాట పట్టారు. తమకు రావాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు మంగళవారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ప్రజలకు నిత్యం సేవలందిస్తూ పారిశుద్ధ్యం, ఇతర కీలక విధుల్లో పనిచేస్తున్న కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్మికులకు చట్ట ప్రకారం నెలకు రూ.16,500 వేతనం చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.8,500 నుంచి రూ.9,500 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు.అంతంతమాత్రంగా అందుతున్న వేతనాలు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఆరు నెలలుగా బకాయిలు పేరుకుపోయాయని నాగేశ్వరరావు తెలిపారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. "జీతాలు లేకుండా కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకోవాలి.. నిత్యావసర ఖర్చులు ఎలా భరించాలి?" అని ఆయన ప్రశ్నించారు.మున్సిపల్ కార్మికుల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు, కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన రూ.16,500 వేతనాన్ని పూర్తిస్థాయిలో చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

స్పందన
తెలుగు దినపత్రిక





# 'డ్రాగన్'లో భారీ ఇంటర్వెల్ యాక్షన్!

హైదరాబాద్, సెప్టెంబరు 13 ::
యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ యాక్షన్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న 'డ్రాగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో మొదటి నుంచే ఈ సినిమాపై ఆసక్తి పెరిగింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

'డ్రాగన్'లో ఇంటర్వెల్ సీక్వెన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ లొకేషన్‌లో కాకుండా ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించి కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సెట్‌లో సుమారు రెండు వారాల పాటు వరుసగా చిత్రీకరణ జరపనున్నట్లు తెలుస్తోంది.

పీటర్ హెయిన్ పర్యవేక్షణలో..

ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌లో ఎన్టీఆర్‌ను మాస్ యాక్షన్ అవతార్‌లో చూపించనున్నట్లు సమాచారం. ప్రముఖ స్టంట్ దర్శకుడు పీటర్ హెయిన్ పర్యవేక్షణలో ఎన్టీఆర్‌పై కీలక పోరాట సన్నివేశాలను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ చిత్రాల్లో యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేకమైన శైలి ఉండటంతో ఈ ఎపిసోడ్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

ఎన్టీఆర్ కోలుకున్న తర్వాతే..

ఎన్టీఆర్ ఇటీవల గాయపడటంతో ఆయనకు శస్త్రచికిత్స జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుస్తోంది. పూర్తిగా కోలుకున్న తర్వాతే చిత్రీకరణలో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా రాబోయే షెడ్యూల్స్‌ను చిత్రబృందం రూపొందిస్తున్నట్లు సమాచారం.

# గురువుల బాటలో.. స్టార్ దర్శకులుగా!

హైదరాబాద్, సెప్టెంబరు 13 :
ఒక విజయవంతమైన సినిమా వెనుక దర్శకుడితో పాటు ఎంతోమంది సహాయ దర్శకుల కృషి ఉంటుంది. తెరవెనుక ఎన్నో మెలకువలు నేర్చుకున్న వారిలో కొందరు ఆ తర్వాత స్వతంత్ర దర్శకులుగా మారి చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. టాలీవుడ్‌తో పాటు భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పలువురు అగ్ర దర్శకులు తమ వద్ద పనిచేసిన ప్రతిభా వంతులను ప్రోత్సహించి దర్శకులుగా తీర్చిదిద్దారు. రామ్‌గోపాల్ వర్మ నుంచి సుకుమార్ వరకు భారతీయ సినిమా రూపురేఖలను ప్రభావితం చేసిన దర్శకుల్లో రామ్‌గోపాల్ వర్మ ఒకరు. ఆయన వద్ద పనిచేసిన వారిలో కృష్ణవంశీ, పూరి జగన్నాథ్, గుణశేఖర్, తేజ, హరీశ్ శంకర్, శివ నాగేశ్వరరావు, అనురాగ్ కశ్యప్, మధుర్ భండార్కర్ వంటి పలువురు దర్శకులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే దర్శకుడు సుకుమార్ కూడా తన బృందం లోని ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించారు. ఆయనతో కలిసి పనిచేసిన బొమ్మరిల్లు భాస్కర్, శ్రీకాంత్ అడ్డాల, వేణు శ్రీరామ్, పాలనాటి సూర్యప్రతాప్, బుచ్చిబాబు సానా, శ్రీకాంత్ ఓదెల తదిత రులు దర్శకులుగా తమ సత్తా చాటారు. రాజమౌళి, పూరి శిష్యులు ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాకు గుర్తింపు తీసుకొచ్చిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వ విభాగంలో పనిచేసిన పలువురు ప్రతిభావంతులు కూడా తర్వాత స్వతంత్రంగా సినిమాలు తెరకెక్కించారు.





# ప్రీతి జింటా రీఎంట్రీ.. ఆసక్తికర వ్యాఖ్యలు

కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఇప్పుడు వరుస చిత్రాలతో రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. 'వైట్' అనే యాక్షన్ కామెడీ చిత్రంతో పాటు 'బట్వారా 1947'లోనూ ఆమె నటిస్తున్నారు. 'వైట్'లో 'మేడమ్ హెచ్' అనే శక్తిమంతమైన గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబరు 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతి పాత్రలోనూ సందేహమే.. తాజాగా జరిగిన సినిమా ప్రచార కార్యక్రమాల్లో నటి వంశిక ధీర్ తనను తాను పెద్ద తెరపై చూసుకున్నప్పుడు 'ఇంపోస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పింది. దీనిపై ప్రీతి జింటా స్పందిస్తూ.. ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్నప్పటికీ ప్రతి కొత్త పాత్రను స్వీకరించినప్పుడు 'నేను ఈ పాత్రను సరిగ్గా చేయగలనా?' అనే సందేహం తనకూ వస్తుందని వెల్లడించారు. సొంత సినిమాలు చూడటం ఇబ్బందిగా.. తన తెరపై చూడటం తనకు చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రీతి జింటా తెలిపారు. థియేటర్‌లో కూర్చుని సినిమా చూస్తున్నం తసేపూ.. తాను చేసిన సన్నివేశాల గురించి ఆలోచిస్తూనే ఉంటానని చెప్పారు.

# ఏడుగురు మహిళల ప్రయాణమే 'హ్యాపీ జర్నీ'

భిన్నమైన మనస్తత్వాలు కలిగిన ఏడుగురు మహిళలు ఒకే ప్రయాణానికి వెళ్తే ఎలాంటి సరదా సంఘటనలు, ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయనే విభిన్న కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలై ఆకట్టుకుంటోంది.

యూరప్ పర్యటన నేపథ్యంలో సినిమా కథ సాగుతుంది. వివిధ తరాలకు చెందిన ఏడుగురు మహిళలు ఈ ప్రయాణంలో కలుసుకుంటారు. భిన్నమైన అభిప్రాయాలు, మనస్తత్వాల కారణంగా తొలుత వారి మధ్య చిన్నచిన్న గొడవలు, సరదా సంభాషణలు చోటుచేసుకుంటాయి. ఆ తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ప్రయాణాన్ని కొనసాగించే క్రమంలో భావోద్వేగభరితమైన సంఘటనలు చోటుచేసుకుంటాయని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.

టాలీవుడ్ సీనియర్ నటి అన్నపూర్ణ, ఆమని, ప్రముఖ యాంకర్ ఝాన్సీతో పాటు వంశీ, పాయల్ రాధాకృష్ణ, సునయన, రవి శివతేజ, జినీష్ అలిశెట్టి, రూప శ్రీనివాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. వినోదంతో పాటు కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది.

అభీరామ్ నాయుడు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గుట్ట ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిలిం కార్పొరేషన్ పతాకాలపై గుట్ట బాలాజీ, గుండాల కౌశిక్ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించగా, మణికంఠ సుబ్రమణియన్ ఛాయాగ్రహణం నిర్వహించారు. వినోదం, సెంటిమెంట్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన 'హ్యాపీ జర్నీ' సెప్టెంబరు 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.






# కామాక్షి భాస్కర్ల డాక్టర్ నుంచి నటిగా..

సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ప్రతి కథానాయికకు స్టార్‌డమ్ రావడం అంత సులభం కాదు. కొందరు వరుస చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంటే.. మరికొందరు చిన్న పాత్రలతోనే ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటారు. అలాంటి నటీమణుల్లో కామాక్షి భాస్కర్ల ఒకరు. వైద్య విద్యను అభ్యసించి వైద్యురాలిగా పనిచేసిన ఆమె.. నటనపై ఆసక్తితో సినీ రంగంలోకి అడుగుపెట్టి ప్రస్తుతం విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

మోడల్‌గా మొదలై.. నటిగా

కామాక్షి భాస్కర్ల చైనాలో ఎంబీబీఎస్ చదివినట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. అనంతరం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో కొంతకాలం వైద్యురాలిగా పనిచేసినట్లు సమాచారం. సినిమాలపై ఆసక్తితో వైద్య వృత్తిని పక్కనపెట్టి నటన వైపు అడుగులు వేశారు. మోడల్‌గా కూడా పనిచేసిన ఆమె.. 2018లో ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ కిరీటాన్ని దక్కించుకున్నారు. అదే ఏడాది మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని ఫైనల్స్ వరకు వెళ్లారు.

సినీ ప్రయాణం తొలినాళ్లలో చిన్న పాత్రలు పోషించిన కామాక్షికి 'మా ఊరి పొలిమేర' కీలక మలుపుగా నిలిచింది. 2021లో విడుదలైన ఈ చిత్రంలో లక్ష్మి పాత్రలో మెప్పించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ మంచి ఆదరణ పొందడంతో ఆమెకు గుర్తింపు పెరిగింది. అనంతరం 'మా ఊరి పొలిమేర 2'లోనూ అదే పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత 'విరూపాక్ష', 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం', 'ఓం భీమ్ బుష్' వంటి చిత్రాల్లో నటించారు. 'ఝాన్సీ', 'సైతాన్', 'దూత' వంటి వెబ్ సిరీస్‌లలోనూ కీలక పాత్రలు పోషించారు.

హారర్, థ్రిల్లర్ కథలకే పరిమితం కాకుండా కామెడీ, కుటుంబ కథలు, భావోద్వేగభరిత పాత్రల్లోనూ తన నటనా ప్రతిభను చూపిస్తున్నారు. 'షో టైమ్', '12ఏ రైల్వే కాలనీ', 'లైలా' వంటి చిత్రాల్లో నటించిన ఆమె.. 2026లో 'మెన్షన్ హౌస్ మల్లేశ్', 'డాకోయిట్: ఎ లవ్ స్టోరీ' వంటి చిత్రాల్లోనూ భాగమయ్యారు. ప్రస్తుతం 'పొలిమేర 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. డాక్టర్‌గా స్థిరపడే అవకాశం ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన నటనా రంగాన్ని ఎంచుకున్న కామాక్షి.. కథ, పాత్రకు ప్రాధాన్యమున్న సినిమాలతో ముందుకు సాగుతున్నారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780